ట్రాఫిక్ పరేషాన్..!

- బీఆర్‌టీఎస్ రహదారిలో గందరగోళంగా రాకపోకలు
- రాంగ్ పార్కింగ్‌తో నిత్యం అవస్థలు
- చర్యలు తీసుకోవాలని స్థానికుల విజ్ఞప్తి


కంచరపాలెం-జ్ఞానాపురం రహదారిలో పార్క్ చేసి వదిలేసిన వాహనాలు



కంచరపాలెం మెట్టు వై జంక్షన్‌లో ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు


ఇండస్ట్రియల్ ఎస్టేట్ బీఆర్‌టీఎస్ రోడ్డులో హెచ్చరిక బోర్డు వద్ద వాహనాల రాంగ్ పార్కింగ్

కంచరపాలెం: కంచరపాలెం బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్యలు పెరిగిపోతున్నాయి. అటు కంచరపాలెం నుంచి జ్ఞానాపురం.. ఇటు మర్రిపాలెం వరకు ఫుట్‌పాత్‌లు, రోడ్లపై ఐదో పట్టణ ట్రాఫిక్ పోలీసులు, జోన్-5 టౌన్ ప్లానింగ్ అధికారులు నిత్యం ఆక్రమణలు తొలగిస్తున్నా.. వాహన చోదకులు, వ్యాపారుల్లో ఎటువంటి మార్పు కనిపించడం లేదు. ప్రైవేటు వాహనాల రాంగ్ పార్కింగ్‌తో స్థానికులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన, అంతర్గత రహదారులపై భారీ లారీలు, ట్రావెల్స్ బస్సుల పార్కింగ్‌తో రాకపోకలు సాగించేందుకు ఇతర వాహన చోదకులు, పాదచారులు నరకయాతన పడుతున్నారు. తాటిచెట్లపాలెం కూడలి నుంచి కంచరపాలెం, కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ వంతెన నుంచి జ్ఞానాపురానికి వెళ్లే రహదారుల్లో వాహనాలను నిలుపుతుండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

రహదారులపైనే పార్కింగ్..

కంచరపాలెం నుంచి ఎన్ఏడీ కొత్త రోడ్డుకు వెళ్లే బీఆర్‌టీఎస్ రహదారిపై వాహనాలను ఇష్టానుసారంగా నిలపడం వల్ల ట్రాఫిక్ సమస్యలతోపాటు ప్రమాదాలు జరుగుతున్నాయి. కంచరపాలెం ఫ్లైఓవర్ వంతెన మార్గంలో ఎఫ్‌సీఐ గిడ్డంగికి వచ్చే లారీలు ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. నిషిద్ధ సమయాల్లో భారీ వాహనాల రాకపోకలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది.

హెచ్చరికలు బేఖాతర్..

ట్రాఫిక్ నియంత్రణకు ఆయా ప్రాంతాల్లో జీవీఎంసీ జోన్-5 టౌన్ ప్లానింగ్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన జరిమానా హెచ్చరిక బోర్డులను కొందరు వాహన చోదకులు పట్టించుకోవడం లేదు. హెచ్చరికలను బేఖాతర్ చేస్తూ ఇష్టానుసారంగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లను నిలిపి ఉంచుతున్నారు. కంచరపాలెం కూడలి గ్రామాభ్యుదయ సంఘం వ్యాపార భవనం వద్ద పార్కింగ్ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. సంబంధిత అధికారులు దృష్టి సారించి బీఆర్‌టీఎస్ రహదారిలో సాఫీగా రాకపోకలు సాగాలే చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రయాణం నరకప్రాయం



కంచరపాలెం నుంచి తాటిచెట్లపాలెం మీదుగా నగరంలోకి వెళ్లాలంటేనే నరకప్రాయంగా ఉంటోంది. నిత్యం భారీ వాహనాలను రహదారికి ఇరువైపులా పార్క్‌చేసి వదిలేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

– బి.ప్రసాద్, కంచరపాలెం

వాహనాలను తరలించాలి



కంచరపాలెం-జ్ఞానాపురం రహదారికి ఇరువైపులా పార్క్ చేసి వదిలేసిన వాహనాలను తరలిస్తే ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవు. ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలి.

– రవికుమార్, జ్ఞానాపురం

క్లుప్తంగా

వయోజనులకు బీసీజీ టీకాలు


జోగారావునగర్‌లో టీకా వేస్తున్న ఏఎన్ఎం

కంచరపాలెం: స్థానిక రామ్మూర్తిపంతులుపేట పట్టణ ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ మట్టా ప్రియాంక నేతృత్వంలో గురువారం వయోజనులకు బీసీజీ టీకాలు వేశారు. 55, 56 వార్డుల పరిధిలోని జోగారావునగర్, గాంధీనగర్, రెడ్డి కంచరపాలెం, జాషువానగర్, అశోక్‌నగర్, గొల్లకంచరపాలెం, తోటవీధి, దుర్గానగర్, గోకుల్‌నగర్, గౌరీనగర్ తదితర ప్రాంతాల్లో వయోజనులకు వ్యాక్సినేషన్ చేపట్టారు. ముందుగా సచివాలయ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, టీబీ సిబ్బందికి వ్యాక్సినేషన్‌పై డాక్టర్ ప్రియాంక అవగాహన కల్పించారు. బీసీజీ వ్యాక్సినేషన్ తరువాత, ఎవరికీ టీకాలు వేయాలి, ఎవరికీ వేయకూడదనే వాటిపై ఆమె పలు సూచనలిచ్చారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు


విద్యార్థులతో అతిథులు, అంగన్‌వాడీ టీచర్లు

కంచరపాలెం: విశాఖ అర్బన్ సింహాచలం సెక్టర్ పరిధిలోని గొల్లకంచరపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రీ స్కూల్ విద్యార్థులను ఆహ్వానిస్తూ, ఐదేళ్లు పైబడిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించే క్రమంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించామని తెలిపారు. సెక్టార్ సూపర్‌వైజర్ జ్యోతి, కంచరపాలెం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మేరీ ముఖ్యఅతిథులుగా పాల్గొన్న అంగన్‌వాడీ పిల్లలకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు టి. విజయలక్ష్మి, జి. జానకి, కె.కృష్ణవేణి, డి.వరలక్ష్మి, టి.బుజ్జమ్మ, డి.నీలవేణి, ఆయాలు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె.తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

విరబూసిన 'మే పుష్పం'



అరుదైన 'మే పుష్పం' సీతమ్మధారలోని ఒక గృహంలో విరబూసింది. ఎంవీపీ హ్యాపీ హోమ్స్‌లో నివసిస్తున్న వయోజన విద్య మాజీ ఉప సంచాలకుడు పండూరి కూర్మేశ్వరరావు 20 ఏళ్ల కిందట తన బంధువుల ఇంటి నుంచి పుష్పం దుంపను తీసుకొచ్చారు. అప్పటి నుంచి ప్రతి ఏటా మే, జూన్ నెలల్లో పువ్వు విరబూసి అందరినీ ఆకర్షిస్తోంది. హ్యాపీ హోమ్స్‌లో ఉంటున్న మహిళలు ఈ పుష్పాన్ని చూసేందుకు వస్తున్నారు. – సీతమ్మధార

ధ్యాన మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు


ధ్యాన మందిరంలో కంటి వైద్య పరీక్షలు చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది


అన్నదానంలో పాల్గొన్న భక్తులు, పేదలు


పల్లకీ సేవలో పాల్గొన్న మహిళలు, భక్తులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధ్యాన మందిరం ప్రాంగణంలో మ్యాక్సీవిజన్ ఐ హాస్పిటల్ సహకారంతో నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 120 మంది భక్తులకు కంటి వైద్య పరీక్షలు చేశారు. వయసు ప్రభావంతో కళ్లలో ఏర్పడే కాటరాక్ట్, సుగర్, హైపర్‌టెన్షన్ వల్ల రెటీనాలో వచ్చే మార్పులు గురించిన సలహాలు ఆస్పత్రి సిబ్బంది ఇచ్చారు. మధ్యాహ్నం బాబాకు హారతి అనంతరం భక్తులకు, పేదలకు అన్నదానం నిర్వహించారు. రాత్రి బాబా భజనలు, పల్లకీ సేవా కార్యక్రమాలు చేపట్టారు. ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాలు, కమిటీ సభ్యులు, భక్తులు, మ్యాక్సీవిజన్ ఆప్టోమెట్రిస్ట్ సునీత, సిబ్బంది రుషిక, వెంకట్ పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండండి


సూచనలిస్తున్న ఈస్ట్ ఏసీపీ జయరామ్‌ప్రసాద్


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు

- మత్తు పదార్థాల జోలికి పోవద్దు
- యువతకు ఈస్ట్ ఏసీపీ సూచనలు

సీతమ్మధార: చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని ఈస్ట్ ఏసీపీ మెహర్ జయరామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. దొండపర్తిలో గురువారం సైబర్ నేరాలు, మత్తు, మాదక ద్రవ్యాలు, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం, మత్తు పదార్థాలకు అలవాటు పడి యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. విశాఖలో మాదక ద్రవ్యాల నివారణకు 100 రోజుల ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలిపారు. డ్రగ్స్ రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. దీనికి ప్రజల నుంచి సహకారం అందించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఇళ్లు అద్దెకిచ్చిన సమయంలో వారి పూర్తి వివరాలు తీసుకోవాలని, వారు ఏం చేస్తున్నారో పరిశీలించాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, విక్రయిస్తున్న వారి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. పిల్లలపై తల్లిదండ్రులు కూడా దృష్టి పెట్టాలని సూచించారు. మత్తు పదార్థాల దుష్పరిణామాలను వివరించారు. అపార్ట్‌మెంట్లు, వ్యాపారాలు చేసుకొనే వారు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. తద్వారా దొంగతనాలు, ఇతర నేరాల నియంత్రణకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఫోర్త్ టౌన్ సీఐ ఎస్.విజయ్‌కుమార్, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు, ఎస్ఐలు వెంకటరావు, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

రాంగ్ పార్కింగ్‌పై పోలీసుల కొరడా


అక్కయ్యపాలెంలో రాంగ్ పార్కింగ్ వాహనాలకు లాక్‌లు వేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్కయ్యపాలెంలో రాంగ్ పార్కింగ్ చేసిన వాహనాలకు పోలీసులు లాక్ వేసి, జరిమానా విధించారు. అక్కయ్యపాలెంతోపాటు ఇతర ప్రాంతాల్లో రాంగ్ పార్కింగ్ చేసి వారిపై చర్యలు చేపట్టారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలకు లాక్‌లు వేసారు. రాంగ్ పార్కింగ్ చేస్తే జరిమానాలు తప్పవని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. వాహన చోదకులు రోడ్డుకు ఇరువైపులా మార్క్ చేసిన ప్రాంతంలో వాహనాన్ని పార్క్‌చేసుకోవాలని సూచించారు.

సినీ ప్రముఖులకు సంగీత కళాభిషేకం


నివాళులర్పిస్తున్న కళారంగ ప్రముఖులు

సీతంపేట: విశాఖ రత్న, దాసరి నారాయణరావు కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సినీ ప్రముఖులకు సంగీత కళాభిషేకం నిర్వహించారు. సూపర్ స్టార్ కృష్ణ, దాసరి నారాయణరావు, ఎన్టీ రామారావు, రామోజీరావు చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. అనంతరం కళారంగ ప్రముఖులకు పురస్కారాలు ప్రదానం చేశారు. ఫొటోగ్రాఫర్ మట్టా లోకేష్‌కుమార్, విశ్రాంత సీఎంవో డి.ఎస్.పట్నాయక్, సినీ నటులు బొబ్బాది, కార్మిక నాయకులు పైడి శంకరరావు, అఖిల భారత ఆర్య వైశ్యుల సంఘం అధ్యక్షులు కొల్లూరి సత్యనారాయణలను సత్కరించారు. నగరానికి చెందిన గాయనీ గాయకులు మనుపల్ల, మాధురి, శ్రీదేవి, వీరేంద్ర, బి.నాగేశ్వరరావు సినీ గీతాలను ఆలపించి ప్రేక్షకులను అలరించారు. సంస్థ ప్రతినిధి పి.ఎ.భాస్కరరావు, అతిథులు కుమార్ నాయక్, నాంచారయ్య, శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామికి చక్రస్నానం

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దత్తత దేవాలయమైన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా గురువారం స్వామికి విశేష ఆరాధన, నిత్య హోమం, చక్రస్నానం జరిపారు. ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, భక్తులు పాల్గొన్నారు.

నేడు వేంకటేశ్వరస్వామి తెప్పోత్సవం..

పోర్టు ఏరియా శృంగమణి పర్వతంపై వెలసిన వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి తెప్పోత్సవం(ప్లవోత్సవం) నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు పోర్టు సహాయ సహకారాలతో శ్రీదేవి భూదేవి సమేతుడైన స్వామికి మేళ తాళాలతో పైలట్ లాంచీలో అతి వైభవంగా తెప్పోత్సవం జరిపించనున్నారు.

మానవాళికి అద్భుత వరం యోగా


మురళీనగర్ బృందావన్ పార్కులో యోగా సాధన చేస్తున్న మహిళలు

మురళీనగర్: నడక ప్రాధాన్యాన్ని తెలుపుతూ ప్రజల్లో ఆరోగ్య స్పృహను కలిగించడమే ధ్యేయంగా మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని వాకర్స్ జిల్లా 101 గవర్నర్ టి.రంగారావు అన్నారు. మురళీనగర్ బృందావన్ పార్కులో క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు నిర్వహణలో మహిళలు చూపుతున్న చొరవ ప్రశంసనీయమన్నారు. లలితారెడ్డి మాట్లాడుతూ పిల్లలు, పెద్దలు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని, తాజా ఆహారం, పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు ఎక్కువగా తీసుకుంటే మహిళల్లో వ్యాధినిరోధక శక్తి పెంపొందించుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన యోగా దినోత్సవంలో యోగా గురువు శేషామణి మాట్లాడుతూ యోగా మానవాళికి పతంజలి ప్రసాదించిన అద్భుత వరమన్నారు. ఈ సందర్భంగా మహిళలతో యోగాసనాలు వేయించారు. యోగా గురువు శేషామణిని మహిళలు ఘనంగా సత్కరించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ కేబినెట్ సెక్రటరీ సత్యనారాయణ, 101 ఎలక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్ ప్రసంగించారు. సేంద్రీయ ఉత్పత్తులతో తయారు చేసిన ఆహారాన్ని హాజరైన సభ్యులకు విజయనగరం జిల్లా జామికి చెందిన కె.శ్యామల స్నాక్స్ అందించారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వ అధ్యక్షులు కె.మాధవి, డి.శిరీష, కోశాధికారి పి.కమల, టి.లీలా నాయుడు, మహాలక్ష్మి, గ్రంథాలయ అధికారి పద్మజ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-1 ఈఈ(ఆపరేషన్స్) బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు నరసింహనగర్, రైతుబజార్, బాలయ్యశాస్త్రి లేఅవుట్, ఈటర్స్ స్టాప్ రెస్టారెంట్, వినాయక గుడి, సింధూర గెస్ట్‌హౌస్, కిన్నెర మెస్, ఎన్‌జీజీవోస్ కాలనీ, అబిద్‌నగర్, పద్మశ్రీ హాస్పిటల్ ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కంచరపాలెం సెక్షన్‌లో..

కంచరపాలెం: జోన్-2 డివిజన్ కంచరపాలెం సెక్షన్ పరిధి సబ్ స్టేషన్‌లోని 11 కేవీ బర్మాక్యాంప్ ఫీడర్‌లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె. నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కంచరపాలెం, ఊర్వశి జంక్షన్, దేవేంద్రనగర్, కంచరపాలెం రైతుబజార్, రవీంద్ర నగర్, ఐటీఐ జంక్షన్, నలందనగర్, ఇంటిలిజెన్స్ కార్యాలయం ఏరియా, అశోక్‌నగర్, రెడ్డి కంచరపాలెం, దుర్గానగర్, గొల్లకంచరపాలెం, తోట వీధి, తుమ్మడపాలెం, గోకుల్‌నగర్, గౌరీనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మర్రిపాలెం సెక్షన్‌లో..

మురళీనగర్: జోన్-2 డివిజన్ మర్రిపాలెం సెక్షన్ పరిధి మర్రిపాలెం వుడా లేఅవుట్, మర్రిపాలెం 11 కేవీ ఫీడర్లలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు మహారాణిపేట వీధి, మర్రిపాలెం మెయిన్ రోడ్డు, రాణాప్రతాప్‌నగర్, శ్రీనివాసనగర్, జ్యోతినగర్, లక్ష్మీనగర్, గ్రీన్ గార్డెన్స్, మొహిద్దీన్ గార్డెన్స్, మర్రిపాలెం, వుడా లేఅవుట్, లీడర్ ప్రెస్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

మురళీనగర్ సెక్షన్‌లో..

మురళీనగర్ సెక్షన్ పరిధి పట్టాభిరెడ్డితోట 11 కేవీ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జోన్-2 ఈఈ బి.కె. నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పట్టాభిరెడ్డి గార్డెన్స్, ఎన్‌జీజీవోస్ కాలనీ, ఆంజనేయ స్వామి ఆలయం, రామాలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

సామాజిక సేవలకు సత్కారం


ఎం.వి.వి.సత్యనారాయణ, శైలజ దంపతులను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

సీతంపేట: ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకుని అంకితభావంతో పనిచేసి సేవా సంస్థలకు తమ వంతు సహకారం అందించాలని రోటరీ క్లబ్ విశాఖ పోర్టు సిటీ అధ్యక్షుడు ఆర్.రామకృష్ణారావు కోరారు. రోటరీ క్లబ్ చేపడుతున్న పలు సేవా కార్యక్రమాలు, పోలియో వ్యాక్సినేషన్‌కు వాగ్దేవి పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు సుమారు రూ.60 వేలు సాయం అందించారు. క్లబ్‌కు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్న వాగ్దేవి స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి.ఎస్.శైలజలను గురువారం పాఠశాలలో రోటరీ క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. రోటరీ క్లబ్ కార్యదర్శి ఎం.ఎస్.ఎన్.రాజు, సంయుక్త కార్యదర్శి కైలాష్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు


బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో కలవరపెడుతున్న కేబుల్, విద్యుత్ వైర్లు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డులోని పలు ప్రాంతాల్లో విద్యుత్, కేబుల్ వైర్లు పిచ్చుక గూళ్లను తలపిస్తూ ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. ముఖ్యంగా బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో చేతికందేంత ఎత్తులో కరెంటు తీగలు వేలాడుతూ కన్పిస్తున్నాయి. ఇక్కడి రహదారుల్లో ప్రయాణిస్తున్న భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా వైర్ తగిలి విద్యుత్ షాక్‌కు గురైతే ఏం జరుగుతుందో ఊహించాలంటేనే భయంగా ఉందని స్థానికులు అంటున్నారు. ఇరుగ్గా ఉండే రహదారుల్లో గోడలకు ఆనుకొని విద్యుత్ స్తంభాలు వేశారు. వాటి నుంచి సర్వీస్ వైర్లు పదుల సంఖ్యలో ఇళ్ల ముందు వేలాడుతున్నాయి. చేయి చాపితే అందే విధంగా వైర్లు ఉంటున్నాయి. విద్యుత్ స్తంభాలకు అనధికారంగా కేబుల్ వైర్లను ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, ప్రమాదకరంగా ఉన్న కరెంట్ వైర్లను సరిచేసి రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

22న సత్యదేవుని ఆలయంలో పౌర్ణమి పూజలు

డాబాగార్డెన్స్: ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో ఈ నెల 22న పౌర్ణమి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో బుద్ధ మహలక్ష్మీ నగేష్ తెలిపారు. జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని ఆ రోజు వేకువజాము 2 నుంచి 4 గంటల వరకు నిత్యారాధన, బాలభోగం, ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సామూహిక వ్రతాలు, మధ్యాహ్నం 12.30 నుంచి అన్న సమారాధన, మధ్యాహ్నం 1 గంటకు పూర్ణాహుతి, ధ్వజ అవరోహణం, చక్రస్నానం, అవబృదం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.


దివ్య వార్షికోత్సవంలో భాగంగా..

ఇసుకకొండ సత్యనారాయణ స్వామి దివ్య వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిహారం నరసింహమూర్తి ఆధ్వర్యంలో వైదికులచే సుదర్శన హోమం, వైదిక సదస్యంలో భాగంగా 25 మంది పండితులకు సత్కారం నిర్వహించారు. అనంతరం మహాదాశీర్వచనం వైభవంగా జరిపారు. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె. శిరీష పాల్గొన్నారు.

నేడు దోపోత్సవం..

శుక్రవారం దోపోత్సవం నిర్వహించనున్నట్టు ఈవో బుద్ధ మహలక్ష్మీ నగేష్ తెలిపారు. 22న జేష్ఠ పౌర్ణమి, 23న శ్రీపుష్పయాగం, అనంతరం పవళింపు సేవతో కల్యాణ వేడుకలు ముగుస్తాయన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి రాజయోగ దోహదం


యోగా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్: రాజయోగతోనే సంపూర్ణ మానసిక ఆరోగ్యం సమకూరుతుందని ప్రజాపిత బ్రహ్మకుమారీ సంస్థ హెచ్‌బీ కాలనీ శాఖ రాజయోగ ధ్యానం ఉపాధ్యాయురాలు బీకే రమ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గురువారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏటా జూన్ 21న ప్రపంచ దేశాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుగుతుందని గుర్తుచేశారు. యోగా శాంతికి చిహ్నమన్నారు. ప్రజలంతా యోగ, రాజయోగ సాధన చేయడం ద్వారా సంపూర్ణ మానసిక ఆరోగ్యం పొందాలన్నారు. ప్రపంచంలో గల 140 దేశాల్లో 9,200కు పైగా ఉన్న బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రాల్లో ఉచిత రాజయోగ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. నగరంలోని హెచ్‌బీ కాలనీ, వన్‌టౌన్ బురుజుపేట, ఎంవీపీ కాలనీ సెక్టార్-1 నేతాజీ పార్క్, మహారాణిపేట అఫీషియల్ కాలనీ, శాంతిపురం, రైల్వే న్యూకాలనీ వినాయక గుడి, గాజువాక బీసీ రోడ్డు, అగనంపూడి, మల్కాపురం అంబేడ్కర్ కాలనీ ప్రాంతాల్లో గల బ్రహ్మకుమారీస్ శాఖల్లో ఉచిత రాజయోగ శిక్షణ ఇస్తున్నామని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రమ తెలిపారు.